# మగపురుగు

"పుట్టిందీ...మళ్ళీ ఆడపిల్లే...నాలుగు వడ్ల గింజలు తీసుకొని గొంతులో వేయండి." "గొంతుమీద కాలేసి తొక్కేద్దురూ!"

"ఋణం. ఏదో ముందు జన్మలో చేసిన అప్పు!"

"ఎంత పెంచినా ఓనాటికి చక్కా యింకో యింటికి వెళ్ళిపోయేదే."

"ఎందుకూ ఉన్నవారు చాలకనా? వంశం పేరు చెప్పడానికో మగపురుగు లేకుండా వందమంది ఆడ పిల్లలు పుడితే మాత్రం!"

"ఎన్నేళ్ళు పెంచితేనేం ఇంకో అయ్య చేతిలో పెట్టవలసిందే."

"అమ్మ బాబో...దాని గయ్యాళితనం చూడవే నేల మీద పడిందో లేదో లంకించుకొన్నది నీలి ఏడుపు."

"అంతా వాళ్ళయ్యను ఒంబుచుకొని పుట్టిందే"

బిడ్డ పుట్టీ పుట్టగానే ఆ తల్లి చూట్టూ ఉన్న మహిళా మండలి ఇన్ని విధాలుగా దీవించింది.

ఏదో కన్న దానికి తెలుసుగా ఆ కడుపు తీపి" అయ్యగారిని పిలిచి కనుగుర్తు రాయించరా పెద్దబ్బా అన్నది ముసలమ్మ.

"ఏడ్చినట్టే ఉంది. దీనికి జాతకం కూడా. సుక్కల్దశ సక్కగా సాగుతుందిలే తొంభై ఏళ్ళు" పంచె దులిపి పైన వేసుకొని వెళ్ళిపోయాడు పెద్దబ్బ.

పురుడు తీరింది. "నిరుడు పుట్టిన బిడ్డకంటే ఈ బిడ్డ బాగుందమ్మా" అన్నది సింగారం.

"దానికేం ఏటా బాలింత. ఇంకో ఏడుమంది ఆడబిడ్డల్ని కన్నా కంటుంది" అంటూ జోస్యం చెప్పింది బంగారం.

"తొలి చూలు మగబిడ్డ పుట్టినా, తొలి కార్తెకే చెరువు నిండినా ఫలితం ఉంటుంది గానీ ఇదేం కర్మం తల్లీ నిరుడూ ఆడబిడ్డే, నేడూ ఆడబిడ్డే" అంటూ సానుభూతిని ప్రకటించింది మాణిక్యం.

"అస లేం పేరు పెట్టాలనుకొన్నారే చింతాయమ్మా" అని ప్రశ్నించింది మరకతం.

"ఏదో ఒక పేరు. పెద్దదానికేమో నా పేరు పెట్టారా. దీనికి వాళ్ళమ్మ పేరు 'వరహా' లంటే సరిపోయింది" అంటూ పెదవి విరిచింది చింతాయమ్మ. వరహాలు పుట్టాక మూడు సంవత్సరాలు బిడ్డలు పుట్టలేదు.

ఇక బిడ్డలే పుట్టరేమోనని అనుమానించిది చింతాయమ్మ

"అయితే ఎట్లా?" అని తనలో తాను ప్రశ్నించుకొన్నాడు పెద్దబ్బ.

"నా కోడలుకు నెల తప్పిందే" అన్నదోనాడు చింతాయమ్మ.

"అవునా!" అంటూ సంతోషాన్ని ప్రకటించింది బగారం.

"ఒక్క పని చెయ్యవే. ఈసారి మగబిడ్డ పుడితే ఆరి మాని గుడిలో ఉయ్యాల గడుతానని మొక్కో" అన్నది సింగారం.

"ముత్యాలమ్మకో పొట్టేలు గొట్టి ఊరేగింపు చేస్తానని నోముల నెల్లో నెల్లి కాయల అక్కమ్మ మొక్కున్నది. ఒసి దానిల్లు బంగారంగానా పనసపండు లాంటి మగబిడ్డ పుట్టాడే. నా మాట విని ముత్యాలమ్మకే మొక్కుకో. ఆ తల్లి అందరిలాంటిది గాదు. పొద్దే మీ దెత్తు కట్టి చూడవే నా మాట వినూ" అన్నది మరకతం.

"ఇవ్వన్నీ ఎందుకే నే నొక్కటే చెబుతాను. ఎందరు దేవుళ్ళయినా ఏల్యమోడికి రద్దే. మగబిడ్డ పుడితే తిరుపతికి ఇలుదీర్థం వెడతామని, నిలువు దోపిడిస్తామని, తల నీలాలు కూడా యిస్తామనీ మొక్కుంటే సరిపోతుంది. మొన్న చూడూ ఆ జానకమ్మకు చందమామ లాంటి బిడ్డ పుట్టాడు.

"ఊరికే పుట్టాడేం" అన్నది మాణిక్యం.

"ఎందు కొచ్చిన తంటా లెండి. మీరు చెప్పిన దేవుళ్ళ కంతా మొక్కుంటే మాత్రం పోయేదేముంది" అని చింతాయమ్మ అందరి దేవుళ్ళకూ మొక్కుకుంది.

"ఏల్యమోరు కళ్ళు తెరచి పాలూ నీరూ వేరైతే పది మందికీ పంచదార పంచుతా"నని మొక్కు కున్నాడు పెద్దబ్బ.

ఆ రోజు కూడా సమీపించింది. ఆ దినం అందరూ

యింట్లోనే ఉన్నారు. ఆ యిరుగు పొరుగు కూడా మేలు కొన్నారు అర్ధరాత్రి సమయాన.

"ముందు తలకు పోయండి నా మాట విని" అన్నది సింగారం.

"నిన్ననేగా పోసుకొంది శుక్రవారం. యింతలో ఎందు కే" అన్నది చింతాయమ్మ.

"సరేలే. సూరమ్మను పిలవలేదేం" అన్నది బంగారం.

"అయ్యో నా బంగారా. నే నొచ్చి జాము సేపయింది గదే" అన్నది సూరమ్మ

అంతా హడివిడిగా ఉంది. పెద్దబ్బ గొడ్ల చావిడిలో నులకమంచంమీద వెల్లకిలా పడుకొని చుక్కలు లెక్కబెడు తున్నాడు.

కెవ్వుమన్న ఏడుపు వినబడింది.

"మగబిడ్డే...మగబిడ్డే..."

"ఒహోహో... దేవేంద్రుడు పుట్టాడే యమ్మా"

"అసలు వాని పుటకే పుట్టక నవమన్మధుడే నవ మన్మధుడు."

"ఎక్కువ అదిమేస్తున్నావ్ ముక్కు అదెంత చిన్నదో చూడు సంపంగి మొగ్గ లాగా"

"ఒరేయ్ పెద్దబ్బా! ఏమిటా మొద్దు నిద్ర. ఆ శామయ్యగారింటికి కెళ్ళి గంటెంతో కనుక్కో" కేకేసింది చింతాయమ్మ.

పెద్దబ్బ ఉలిక్కి పడి, "నే నెక్కడ నిద్రపోయానే ఇదో కనుక్కుంటా"నని పరుగుతీశాడు చీకటిని చీల్చుకొంటూ.

మగబిడ్డ పుట్టడంతో ఆ యింటి వాతావరణం మారి పోయింది. కొడుకును కన్నతల్లికి కొండంత గౌరవం వచ్చింది.

జాతకం వ్రాశారు.
పురుడు పోశారు.
నామకరణం చేశారు.
అక్షతాభ్యాసం చేయించారు.
అబ్బాయి పేరు రామలింగం.
అరటాకుల్లో పెట్టి పెంచారు.
ఆవు నేతితో అన్నం తినిపించారు.
ఆడుగులకు మడుగు లొత్తారు.
అడిగిందాల్లా తెచ్చి పెట్టారు.
తొడిగిందల్లా కోరి కుట్టించారు.
చింతాయికి బుద్ధి తెలిసింది.
వరహాలు కూడా పుష్పవతి ఆయింది.
ఆ యిద్దరికీ పెండ్లిండ్లయినాయి.
అంపకాలపుడు ఆ యిద్దరూ ఎన్నో ఆడిగారు.
నాకో కాసుల పేరు కావా లన్నది చింతాయమ్మ.
నాకో గజ్జె లడ్డిగ కావా లన్నది వరహాలు.

"కొంపను కాళీ చేయండి. ఉన్నదంతా ఊడ్చుకపోతే ఎట్లా?" అన్నాడు పెద్దబ్బ.

"ఎంత పెడితే నేం. ఆడబిడ్డల ఆశల కంతుందా? మీ ఎత్తుభారం ఈ నాటితో తీరదుగా. ఏడాది కోసారి ఏడవాల్సిం

డెంతో ఉంది'' అన్నది స్వంత తల్లే.

"అసలు మీకు పసుపూ పూలు కుంకం యివ్వాలంటే ఈ యిల్లు పచ్చగా ఉండొద్దూ" అంటూ ఎత్తి పొడిచింది ముసలమ్మ.

ఆ ఇద్దరూ వెళ్ళిపోయారు.

అత్తగారిళ్ళు చేరుకొన్నారు.

ఆ వెనుక అయిదు సంవత్సరాలు హాయిగానే గడిచింది.

రామలింగానికి పెళ్ళి జరిగింది. వందలాదిగా వచ్చారు చుట్టాలు. ఇరవై పొత్తరలు పులాకులై పోయినై.

"ఎంత చక్కంగా ఉందే నీ కోడలు చుక్కలాగా... కోడలు నలుపైతే కులమంతా నలుపు. నీ కోడలచ్చం దొండపండే మీనాక్షమ్మా" అంటూ అభినందించింది సూరమ్మ.

"ఔనౌను'' అంటూ సమర్థించుకొన్నది చింతాయమ్మవ్వ.

కోడలు కాపురానికి వచ్చి మూడు మాసాలైనవి. అత్తగారి పెత్తనం అడుగంటింది. అవ్వగారి అధికారం గవ్వకు కూడా చెల్లకపోయింది. మామగారి హక్కులు మంటగలిశాయి

"రామలింగానికి అత్తగారింటిలో నిమ్మకాయంత మరుపు మందు మ్రింగించారన్నది'' మరకతం.

"కాకుంటే కన్నతల్లిని పట్టుకొని తంబె పలుపుతో చావ కొడుతాడా'' అంటూ విస్తుపోయింది మాణిక్యం.

మరకతం అన్న మాటలో సత్య మెంతో చెప్పలేం కానీ మాణిక్యం అన్నట్టు తంబె పలుపుతో తల్లిని కొట్టాడు రామలింగం.

అ దేమంటూ ముసలామె అడ్డుపడితే ఆమెను ములు గోలతో చితక పొడిచాడు. ఏమిట్రా ఈ ఆగడం అంటూ విరుచుకపడ్డ పెద్దబ్బ రెండు చెంపలూ వాచిపోయినై.

ఏమి టీ విపరీతం అనుకున్నా రంతా. మీనాక్షమ్మ అవమానంతో క్రుంగిపోయింది. పెద్దబ్బ ఆత్మహత్య చేసు కొంటే పోయేదిగా అన్నంతవరకూ వచ్చాడు. ముసలామె నోరు నొచ్చేవరకూ వాగివాగీ ఆగిపోయింది.

రామలింగం ఏ మాత్రం తగ్గలేదు. మాటా మాటా వచ్చి యిల్లు వదలి వెళ్ళమన్నాడు పెద్దబ్బ.

"ఇది నీ సొమ్ము కాదు. నా తాత సొమ్ము" అంటూ బోషాణం తాళం గుత్తిని తెంపుకొన్నాడు రామలింగం.

అప్పుడు జ్ఞాపకానికి వచ్చింది వరహాలు. కనులముందు అస్పష్టంగా కన్పించింది చింతాయి. పెద్దబ్బ ఎవ్వరికీ చెప్ప కుండా వరహాలు యింటికి వెళ్ళి పోయాడు. తాను కాపురానికి వచ్చిన వెనుక తండ్రీ అదే తొలిసారి తన కడప త్రొక్కడం. ఆమె సంతోషానికి మేర లేకపోయింది. ఆనందంతో చేతికి నీ ళ్ళిచ్చింది. ఆప్యాయతతో వడ్డించింది. కన్న కూతురి చేతి అన్నం కన్నతల్లి పెట్టినటే ఉంది.

పెద్దబ్బ సంతృప్తిగా భుజించి పడుకుని నిద్ర పోయాడు. ఆ మరునాడు...ఆ మరునాడు గడిచాక మూడో రోజున అన్నాడు.

33

"నే నిక్కడే ఉండిపోతా నమ్మా వరహాలూ" అని.

ఆమె నాన్నగారి కన్నీటిని చూచి ఆశ్చర్యపడింది. ఏం జరిగిందో తెలియక తికమకపడి చివరికి సాహసించి అడిగింది. విషయం తెలుసుకొన్నాక గుండె పగిలేలా ఏడ్చింది. వాడిని పాతర వేస్తానంటూ నాగుపాములా పైకి లేచింది.

"నువ్వేమీ పని చేయవద్దు. ఇష్టం ఉంటే అలా మామిడి తోటకో, కొంకాయ తోటకో వెళ్ళిరా. వాడి ముఖం చూడవద్దింక" అన్నది.

వారం రోజులు గడిచాక చింతాయి జాబు వ్రాయించింది. మీనాక్షమ్మ ఆమె వద్దకు వచ్చిచేరు కొన్నదట. పిల్లాణ్ని ఆడించుకొంటూ ఉంటే చాలని, పెద్ద దిక్కుగా ఉంటుందని భర్త చెప్పడం వల్ల అమ్మను నిలుపుకొన్నానని వ్రాయించింది.

"అయితే ముసలమ్మ ఏమైనట్టు?" ప్రశ్నించాడు పెద్దబ్బ. దానికి సమాధానంగా ఆ మరునాడే ఇంకో ఉత్తరం వచ్చింది. ఆ జాబు ముసలమ్మ వ్రాయించింది.

"నా కట్టెలో జీవం ఉండేవరకు యింకొకరి కడప త్రొక్కను. నా గుక్కెడు ప్రాణమూ ఇక్కడ పోవలసిందే. వాడేదో కోపం వచ్చి కొడితే పారి పోవడం ఎందుకు? మన బిడ్డేగా కొట్టింది"

పెద్దబ్బ నాలుక చప్పరించి వూరుకున్నాడు. ఒక్క సంవత్సరం గడిచిపోయింది. ముసలమ్మ చచ్చిపోయింది. పెద్దబ్బ మీనాక్షమ్మ అందరు చుట్టాలు ఆ నాడొక్కచోట

చేరారు. దహనమయిపోయింది పాలు కూడా పోసేశారు. ఉత్తరక్రియలు కూడా ముగిసిపోయినవి.

ఆ రాత్రి నలుగురు చుట్టాలూ రామలింగాన్ని అడిగారు. తల్లీ తండ్రీ పొరుగింట్లో ఉండటం మర్యాద కాదని.

రామలింగం బదులు చెప్పలేదు. అతడు అమ్మా నాన్నలతో ఒక్కమాట కూడా మాట్లాడలేదు.

వరహాలుకు రోషం వచ్చింది. "నిన్న కాక మొన్న పుట్టిన ఈ వెధవ నెందుకు బ్రతిమలాడ్డం, లెయ్యండి పోదాం" అంటూ పైకి లేచింది. చింతాయి కూడా అప్పుడే లేచి మూటా ముల్లే సర్దుకున్నది. మీనాక్షి చింతాయమ్మ బండిలో కూర్చున్నది. పెద్దబ్బ వరహాల బండిలో కూచున్నాడు. రెండు బండ్లూ కదలుతుంటే విస్తుపోతూ చూచారు ఇరుగు పొరుగు.

"ఎంత మగవాడైనా వాడి పెళ్ళానికి లోకువే. ఎందుకో ఈ మగబిడ్డలు?"

"తల్లి పాలు త్రాగి రొమ్ము గుద్దడం కొడుకుల చేత వుతుంది కాని కూతుళ్ల చేతవుతుందా?"

"పెట్టి పుట్టాడు అనుభవించడానికి. ఏనాటి ఋణమో కాకుంటే ఇదేం విపరీతం?"

"ఎన్నాళ్ళు పెంచితే నేం, కంటికి ఒత్తు లేసుకొని కాపాడారు. దేవేంద్రుడు పుట్టాడనుకొన్నారు. వీడే యముడై కూచున్నాడు"

"ఏమైనా ఆడ పుట్టకే పుట్టక. అత్తా మామల చూచి

మూతి ముడుచుకొన్నా అమ్మా నాన్నలను చూచినప్పుడైనా అయ్యో యంటుంది మనస్సు!"

ఇట్లా నానా విధాలుగా అనుకొన్నారు అమ్మలక్కలు.

పాపం! ఎంత శ్రమ వచ్చిందే. వీడికోసం ఎన్ని నోములు నోచిందా తల్లి. వీడికి పుట్టు గతులుంటాయా అంటూ చీది చీదీ వేసింది సింగారం.

"ఎన్ని దేవతలకు మీదు లెత్తి కట్టింది పాపం! ఇందుకేనా?" అంటూ ముక్కుమీద వేలేసుకొన్నది మరకతం.

"ముప్పయ్యో ఏట తలనీలాలు కూడా యిచ్చిందిగదే!" అంటూ యింటివైపు దారి తీసింది. మాణిక్యం.

రెండు బండ్లూ కనుచూపు మేరను దాటుకొన్నవి.

